# మాయ ముత్యాలు

ఆ దుకాణము పెద్దబజారులో ఉన్న నగల దుకాణాలన్నిటిలోకీ ఆడంబర మైనది. సరిగ్గా దానిముందరే ఒక యువతి బండిదిగి నాలుగుప్రక్కలా కలయ జూస్తున్నది. ఆమె నడక ఏవైపుకు సాగుతుందోనని గమనిస్తున్న ఆ దుకాణపు నౌకర్లు ఆమెకు ఎదురుగా వెళ్ళి "దయచేయండి అమ్మగారూ!" అని ఆమెను ఆహ్వానించి లోపలికి తీసుకొని వెళ్ళారు; ఆమెకొక మంచికుర్చీ చూపించి కూర్చో మాన్నారు; ఎలక్ట్రికు ఫాను పెట్టారు.

ఆమె సరిగా సర్దుకొని కూర్చోకముందే ఆ నౌకర్లలో ఒక యువకుడు "మీకేం కావాలో చెప్పండి. గాజులా—ఉంగరాలా? కొత్త కొత్త నమోనాలు చాలా వచ్చాయి. చూస్తారా?" అన్నాడు ఆమెకు ఎదురుగా నిలబడి.

ఆమె కంటికి కనబడ్డదగ్గర్నుంచీ నౌకర్లు చేస్తున్న హడావిడిని చిన్నసేటు కనిపెట్టుతునే ఉన్నాడు. కుర్చీవేసి కూర్చోపెట్టటము అయిన తరువాత దిగ్గునలేచి అక్కడికి వచ్చాడు ఆమె కెదురుగా. "మీకు పెద్దయింటి అమ్మగార్లతో మాట్లాడ టము తెలియదు. అవతలికి వెళ్ళి మీ పనులు చూసుకోండి" అంటూ నౌకర్ల నంద రినీ పంపివేసి, మందహాసముతో ఆమెవైపుకు తిరిగాడు.

"చూడండీ! మాదగ్గరికి మొన్న దీపావళీకే కొత్త సరకు దిగింది. కొత్త కొత్త డిజైనులు- అంటే ఇంగ్లీషు, అమెరికా డిజైనులు వచ్చాయి. ఉంగరాలూ. గాజులూ అనేకరకాలలో ఉన్నాయి."

ఆమె తన మాటలను వింటున్నట్లు తోచగానే, క్రాపు సవరించుకొంటూ— చిరునవ్వుతో-ప్రతి మాటా చాలా జాగ్రత్తగా స్ఫుటముగా ఉచ్చరిస్తూ మళ్ళీ అందుకున్నాడు.

"ఒక మహారాజుగారు అంటే జమీందారుగారు ఇటువంటి ఉంగరాన్నే మొన్నకొన్నారు. ఇక్కడినుంచే పంపించారు వారి ప్రియతముల కెవరికో. ఈ

ఉంగరాలు ప్రేమికుల మధ్య రాయబారము నడుపుతాయనుకోండి. మా దగ్గర ఇవి చాలా ఖర్చు అవుతున్నాయి. మీరుకూడా చూడండి" అంటూ చెవిలో వేలుపెట్టి ఆత్తరులో ముంచిపెట్టుకొన్న దూదిని సవరించుకున్నాడు.

ఆమె వింటూ కూర్చున్నది కాని పెదవి కదపలేదు.

మరో రెండు నిమిషాలు చూసి అతడు మళ్ళీ ప్రారంభించాడు "పోనీలెండి. ముత్యాలహారాలు చూస్తారా! ఒంటివరసవి-రెండు వరసలవి- మూడు వరసలవి- అందమైన లాకెట్లతో సిద్ధముగా ఉన్నాయి. పెద్దపెద్ద ఇళ్ళలో ఉండతగినవి. మహా రాజుల ఇళ్ళల్లో ఇటువంటి జాతి ముత్యాలే ఉండేవి. మీకు ఏ నమోనా కావాలంటే ఆ నమోనా చూడండి" ఆ యువకుడు ఆపకుండా చెప్పుకొని పోతున్నాడు. ఆమె ఈ మాటలన్నీ వింటున్నదో లేదో గాని అద్దాల కేసులో పెట్టిన వస్తుజాలాన్ని తల తిప్పకుండా కళ్ళతో పరికిస్తున్నది.

తాను చెప్పినవీ చూపించినవీ ఆమెకు నచ్చటము లేదేమో నన్న సంశయముకొద్దీ, తిరిగి వాటిని వర్ణించి వర్ణించి చెప్పటము మొదలుపెట్టాడు.

పావుగంట తరువాత ఆమె కూర్చున్న చోటనుంచి లేవగానే అతడి కేదో స్ఫురించి "మీరు లేచి స్వయముగా చూస్తే మంచిది. నిన్ననే వచ్చినవి. ఈ ఉదయమే షోకేసులో అమర్చాము. ఇట్లా వచ్చి చూడండి" అన్నాడు.

ఆమె అలంకరణ వయసును కప్పిపుచ్చుతున్నది. తెల్లటి నైలాన్ చీరె కట్టుకున్నది. తెల్లటిదే గుత్తమయిన చోలీ ధరించింది. ఎత్తుమడమల కాలిజోడు తొడగటమువల్ల నికరమైన ఆమె పొడవు చూపరులకు వెంటనే తెలియదు. తల వెంట్రుకలు కూడా ఎంత దీర్ఘములో తెలియటానికి అవకాశము లేదు. పొడుగు పాటి చేతిగోళ్ళకూ, కాలిగోళ్ళకూ రంగు వేసుకున్నది. ఆమె మెల్లగా ఒక్కొక్క అడుగే వేస్తుంటే. దుకాణము ముందు నిలబెట్టిన బొమ్మ కదలి వస్తున్నదేమో ననిపించిందాతడికి. ఆమె ముత్యాలహారాలు పెట్టిన షోకేసుదగ్గర నిలబడగానే అతడు చప్పున దానిని తెరచి ఇరవై డబ్బాలను పైకితీసి తెరచి బల్లమీద పెట్టాడు. ఆ యువకుడు ఒక్కొక్కదాన్నీ వర్ణించటము మొదలు పెట్టాడు.

ఆమె వాటిలోనుంచి ఒకటిదీసి తన మెడలో పెట్టుకోవాలని ప్రయత్నించుతూ ఉండగా "అద్దము ముందు నిలబడి పెట్టుకోండి" అంటూ ఆమెను అద్దము

ఎదుటకు తీసుకొనివెళ్ళాడు. ఆమె కళ్ళనార్పుతూ అద్దములో చూసుకొని ఆహారాన్ని అమర్చుకుంటూ ఆ యువకుని క్రీగంటితో గమనించింది. పొడుగాటి వేళ్ళతో ముత్యాలహారాన్ని అమె మెడలో సర్దుకోవటాన్ని అతడు అదేపనిగా చూస్తున్నాడు.

ఆమె తన దృష్టిని హారము మీదినుంచి మరల్చకుండా మెడలోనుంచి తీసి "దీని వెల ఎంత?" అన్నది ఒయ్యారముగా

ఆమె వచ్చినప్పటినుంచీ పెదవులను కదల్పటానికి ఇదే మొదలు. సుమారు గంటకుపైగా పడిన శ్రమకు ఒక్క హారమైనా అమ్ముడు పోతుందన్న ఆశతో ఎంతో ఆప్యాయంగా అతడు దానివెల చెప్పాడు.

అతడికి ఆమె ముఖముమీద కొద్దిగా ఉదాసీన భావము కనబడ్డదో- లేక ఆ సమయానికి ఆ విధంగా తోచిందోగాని చప్పున వెనక్కు తగ్గి "మా నాయనను అడిగి సరైన ధర తెలుసుకొని చెప్తాను ఉండండి." అని వెళ్ళాడు ఆ హాలు దాటి.

పరుపుమీద దిండ్లనానుకొని కూర్చున్న పెద్దసేటు దిగ్గునలేచి కొడుకు కంటే ముందుగా ఆమె దగ్గరికి వెళ్ళి తనగదిలోకివచ్చి కూర్చోమని సవినయముగా కోరాడు. రెండు లెమను గ్లాసులను తెమ్మని నౌకరును పంపి పరుపుమీద కూర్చుని ఆమెవైపు తిరిగి మందహాసము చేశాడు.

"మీరు పసందు చేసే సరుకును మావాళ్ళు ఇంతవరకూ చూపనేలేదు. అప్పటినుంచీ మీరు చూసినది పురాతనపు సరుకు. ఆధునిక తారలందరూ ఈ హారాలను వాడుతున్నారు. సెలక్షను అంటే వాళ్ళదేనండీ! అందాల పోటికి వెళ్ళిన వారందరూ ఈ హారాలను ఉపయోగించారు. దీన్ని తప్పకుండా మీరు మెచ్చి తీరుతారు." అంటూ ఆమె చేతికి కళ్ళు జిగేలుమనే డబ్బా ఒకటి అందిచ్చాడు.

ఆమె దానిని తెరచి చూసే అంతలో డ్రింక్సు వచ్చాయి. ఒక గ్లాసు ఆమె చేతి కందించి తానొకటి తీసుకొన్నాడు పెద్దసేటు. ఆమె సందేహిస్తూనే అందుకొన్నది.

"మాకు టౌన్లులో ఒక థియేటరున్నది. మీకు తీరికయినప్పుడు దయ చేయండి" అంటూ గ్లాసుకింద బెట్టాడు.

"మంచి హిందీ చిత్రము వచ్చినప్పుడు తెలుపండి" అన్నది చిరునవ్వుతో ఆమె.

ఆకుబీడాల పళ్ళెము ఆమె ముందరపెట్టి "ఇంతకూ అమ్మగారు ఏ హారము పసందు చేసినట్లు?" అన్నాడు పెద్దసేటు బంగారు రేకు తొడగిన పళ్ళను పైకి కనబరుస్తూ.

ఆ యువతి తలవంచుకొని చేతిసంచిని ఒక చేతిలోనుంచి మరొక చేతిలోకి మార్చుకుంటూ "మళ్ళీ ఒకసారి వస్తాను. మంచి హిందీ చిత్రము వచ్చినప్పుడు తెలుపుతానంటిరిగా!" సన్నటి కంఠ స్వరముతో పాట పాడినట్టుగా అని లేచింది.

పెద్దసేటు దాని కెంతమాత్రమూ నిరుత్సాహ పడలేదు. "మీరు ఎప్పుడు తీసుకోదలచినా మా దుకాణాన్ని మరువకండి. మాకార్డు మీ దగ్గర ఉంచండి" అంటూ కార్డు ఒకటి ఆమెకిచ్చి ఆమె బండీ ఎక్కేవరకూ దుకాణము ముందర నిలబడే ఉన్నాడు. ఆమె బండీ కదలగానే లోపలికి వచ్చి తన పరుపుమీద కూర్చుని "అమ్మయ్య" అనుకున్నాడు.

అప్పటికే నౌకరులందరూ సందడిగా అటూ ఇటూ తిరుగుతూ గుసగుస లాడు కుంటున్నారు. భయము కొద్దీ ఒకరిద్దరు మూలమూలల కొరిగారు. పెద్ద సేటు కది అర్ధముకాక "ఏమిటది?" అన్నాడు గట్టిగా.

కొంతసేపటికి వాళ్ళల్లో ఒకడు ముందుకు వచ్చి "ఆ అమ్మగారు ఖరీదుచేసిన ముత్యాల హారానికి బిల్లు వ్రాసింది ఎవరని గుమాస్తా అడుగుతున్నాడ"ని తడి ఆరిపోయిన గొంతుతో అన్నాడు.

పెద్దసేటు ముఖము ఆ మాట వినగానే ముడతలు ముడతలుగా ముకుళించు కొని పోయింది. చిరుచెమట పట్టింది. కళ్ళు పెద్దవిచేసి "ఏ హారమంటున్నావు? ఆమె కొననిదే బిల్లు వ్రాయుట మెందుకు?" అని అరిచాడు ఆందోళన కొద్దీ.

"డబ్బాలో హారములేదు. చిన్నసేటు కూడా అప్పటినుంచీ వెతికాడు" అన్నాడా నౌకరు వణుకుతున్న కంఠముతో - పైకి వినిబడకుండా గొణుగుతూ చేతులను నలుపుకుంటూ ఒగిగి నిలబడ్డాడు.

పెద్దసేటు ఏదో అందామని నోరు తెరచాడు గాని మాట బైటికి పెకలి రాలేదు. ఆవేశము కొద్దీ దుకాణమంతా కలయ దిరిగి ఒక గంట తరువాత తన పరుపుమీద కూర్చుని హుక్కాగొట్ట మందు కొన్నాడు.

వృద్ధుడైన గుమాస్తా మాత్రము "ఆ తెల్లని తెలుపులో ఎంత మాయ ఉన్నదో ఎవరు తెలుసుకోగలరు? కొడుకు చేసే మంచి ముత్యాల బేరములో మోసము జరుగుతుందని తండ్రి మాయ ముత్యాల బేరము చేయబోయాడు-కాని ఎదుటి ముత్యము మరింత మాయదాయె!" అంటూ కలముతో తల గోక్కున్నాడు.